ప్రజల ఆస్తులను విక్రయించొద్దు !

కాచిగూడ: ప్రజల ఆస్తులను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదని, ప్రజలు ప్రభుత్వ వేలం పాటలో పాల్గొని భూములు కొనుగోలు చేయొద్దని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. ప్రజల ఆస్తులను కొనుగోలు చేస్తే బీసీ విద్యార్థులతో కలిసి ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. రాష్ట్రంలో 295 గురుకుల పాఠశాలలు, బీసీ హాస్టళ్లు ఉన్నాయని, వాటిలో ఒక్కదానికి కూడా సొంత భవనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి విద్యార్థులపై ప్రేమ ఉంటే వెంటనే గురుకుల పాఠశాల, కళాశాల, బీసీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

'కులం పుట్టుక నిర్మూలన' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో అనురాధ తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం : ప్రముఖ రచయిత మోహన్ తలారి అనువదించిన 'కులం పుట్టుక నిర్మూలన' పుస్తకాన్ని సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత అనురాధ మాట్లాడుతూ.. దేశంలో కుల నిర్మూలన జరిగినప్పుడే సమసమాజ స్థాపన జరుగుతుందని అభిప్రాయపడ్డారు. కులం పోవాలనేది అంబేడ్కర్ ఆశయమని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సీనియర్ జర్నలిస్టు విజయ్‌సాధు, సీపీఐ నేత స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

'దండకారణ్యంలో నరమేధం ఆపాలి'

ముషీరాబాద్: దండకారణ్యంలో నరమేధం ఆపాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 17 మందికి పైగా మావోయిస్టులు చనిపోయారని వరుస ఎన్‌కౌంటర్లతో దండకారణ్యంలో నరమేధం జరుగుతుందని ఆరోపించారు. కేంద్రం కార్పొరేట్ కంపెనీల మార్కెట్ కోసం ఆదివాసులు, విప్లవోద్యమకారులను వేటాడి చంపుతుందని విమర్శించారు. పౌర సమాజం స్పందించి ఈ ఎన్‌కౌంటర్ హత్యాకాండపై నిరసన తెలపాలని పిలుపునిచ్చారు.

ప్రేమిస్తున్నానని మోసం..

యూట్యూబ్ నిర్వాహకుడి రిమాండ్

అంబర్‌పేట: మూడేళ్లుగా ప్రేమిస్తున్నానని వెంటపడి, పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తీసుకురావడంతో తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన శనివారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం ప్రకారం.. బాగ్‌అంబర్‌పేట సీసీకాలనీలో నివసించే యువతిని తుర్కయంజాల్ యాదాద్రి కాలనీకి చెందిన చలమల శంకర్‌గౌడ్(34) మూడేళ్లుగా ప్రేమిస్తున్నానన్నాడు. అతడి మాటలు నమ్మి ప్రేమించడంతో సదరు యువతిని శారీరకంగా వాడుకున్నాడు. ఇటీవల ఆమె పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడంతో తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

దాడులకు పాల్పడుతున్న వ్యక్తి రిమాండ్

చిక్కడపల్లి: రాత్రి వేళల్లో దాడులకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. నిజామాబాద్ జిల్లా సారంగాపూర్ గ్రామానికి చెందిన తరంగి లక్ష్మణ్ కుమారుడు నాగరాజు (34) ఫంక్షన్‌హాల్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. కాగా విజయదాస్ (44) తన కుటుంబ పోషణ కోసం చిక్కడపల్లిలో టీ స్టాల్ నడుపుకుంటూ జీవనం పక్క గల్లీలో నివాసం ఉంటున్నారు. ఈనెల 23న అతడు నడుపుతున్న టీస్టాల్ వద్దకు రాత్రిపూట మూసివేసిన సమయంలో తరంగి నాగరాజు వచ్చి దాడిచేసి నగదు ఎత్తుకెళ్లాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శనివారం పక్కా సమాచారంతో చిక్కడపల్లి క్రైం పోలీసులు దాడికి పాల్పడిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నాడు. పోలీసుల విచారణలో నిందితుడు పాత నేరస్తుడని, అతడిపై అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో 5, మలక్‌పేట్‌లో 1 , సుల్తాన్‌బజార్‌లో ఒక కేసు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. సెంట్రల్ జోన్ డీసీపీ, శిల్పవల్లి ఆదేశాల మేరకు అదనపు డీసీపీ ఆనంద్, చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ పర్యవేక్షణలో డీఐ శేఖర్, ఎస్సై నాగరాజు, క్రైం సిబ్బంది నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

లిబర్టీ: రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుంటే విపక్షాలు అడ్డుకుంటున్నాయని సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు అన్నారు. శాసనసభలో ప్రభుత్వానికి సహకరించకుండా విమర్శలతోనే సరిపెట్టుకున్నారని ఆరోపించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసన సభ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం ఏ చర్చకైనా సిద్ధంగా ఉన్నప్పటికి ఆరోపణలు విమర్శలతోనే బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు కాలాన్ని వృథా చేశారని ఆరోపించారు.

2,95,779 కార్డుదారులకు ఉగాది కానుక

ఏప్రిల్ 1 నుంచి సన్నబియ్యం పంపిణీ.. | ఇప్పటికే రేషన్‌షాపులకు చేరుకున్న బియ్యం



బంజారాహిల్స్: అధికారంలోకి వస్తే సన్నబియ్యం పంపిణీ చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ 1 నుంచి రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం నుంచి ఆయా షాపుల్లో సన్న బియ్యం పంపిణీకి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 81 రేషన్ దుకాణాలకు గత మూడు రోజుల నుంచి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు.

ఉగాది కానుకగా..

ఆయా రేషన్‌షాపులకు అవసరమైన స్టాక్‌ను ముందుగానే తీసుకువచ్చి భద్రపరిచారు. రేషనింగ్ సర్కిల్–7 పరిధిలో ఉగాది కానుకగా 2,95,779 మంది సన్నబియ్యం అందుకోనున్నారు. సర్కిల్ పరిధిలో ఇప్పటికే 81,013 రేషన్‌కార్డులు ఉండగా ఇటీవల కొత్తగా 2,897 కొత్త కార్డులు ప్రకటించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి అన్ని షాపుల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని నిర్ణయించారు. సన్నబియ్యం పంపిణీ చేస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల నుంచే ప్రకటిస్తూ కార్డుదారులను ఊరిస్తూ వచ్చింది. నాలుగు రోజుల క్రితం పౌర సరఫరాల శాఖ మంత్రి అసెంబ్లీలో ప్రకటన జారీ చేస్తూ కొత్తగా మంజూరైన కార్డుదారులతో పాటు పాత కార్డుదారులందరికీ ఏప్రిల్ 1 నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామని చెప్పారు.

పక్కదారి పట్టకుండా..

ఉగాది రోజునే మంత్రి సన్న బియ్యం పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. ఏప్రిల్ 1 నుంచి అన్ని దుకాణాల్లో పంపిణీ జరగనుంది. ఇప్పటికే రేషన్ షాపులకు చేరుకున్న సన్న బియ్యం నిల్వలను పౌర సరఫరాల శాఖ అధికారులు తనిఖీలు చేశారు. బియ్యం పక్కదోవ పట్టకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. డీలర్లకు తగిన సూచనలు జారీ చేశారు. ప్రతికార్డుదారుడూ సన్న బియ్యం తీసుకోవడానికి ముందుకు రానుండడంతో ఈ సారి రేషన్ బియ్యం పక్కదారి పట్టే అవకాశాలు లేవని అధికారులు అంటున్నారు.

ఖైరతాబాద్ సర్కిల్‌లో కార్డుల వివరాలు..

మొత్తం రేషన్ షాపులు:	81
తెల్ల రేషన్ కార్డులు :	79,531
ఇటీవల కొత్తగా మంజూరైన కార్డులు:	2,897
అంత్యోదయ అన్నయోజన కార్డులు:	3,481
అన్నపూర్ణ కార్డులు:	1
కార్డుల్లో మొత్తం సభ్యుల సంఖ్య:	2,95,779
మంజూరైన సన్నబియ్యం:	18,19,011

'ఉగాది ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలి'



జ్ఞాపికను అందజేస్తున్న నీలం సుఖేందర్

కాచిగూడ: ఉగాది ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. 'బ్లిస్ బర్గ్ ఫ్యూచర్ హోప్' సంస్థ ఆధ్వర్యంలో శనివారం సంస్థ ఉపాధ్యక్షుడు నీలం సుఖేందర్ అధ్యక్షతన ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరై వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. శ్రీవాసు, డాక్టర్ హరికుమార్, డాక్టర్ వినయ్‌కుమార్ తదితరులు ఉగాది పురస్కారాలను అందుకున్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల్లో ఏ పండుగను చూసినా అది ప్రకృతితో ముడిపడి ఉంటుందని, ఉగాది కూడా ప్రకృతి ఆధారంగానే ఉంటుందన్నారు.

సాంకేతికతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి



అంబేడ్కర్ కళాశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రొఫెసర్ లింబాద్రి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని అప్పుడే వారికి అన్ని అవకాశాలు లభిస్తాయని ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో మ్యాజిక్ బస్ అర్గనైజేషన్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గత 30 రోజులుగా 'మ్యాజిక్ బస్ ఆర్గనైజేషన్' ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్, 'ఎనలాటికల్స్ టెక్నాలజీ టూల్స్‌పై అవగాహన'తో వారిలో ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. మార్కెట్ ఉపాధి అవకాశాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చాగంటి శ్రీనివాస్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ విష్ణుప్రియ, ఎంబీఏ కళాశాల డైరెక్టర్ డాక్టర్ అప్పలయ్య మీసాల తదితరులు పాల్గొన్నారు.

న్యూ రామాలయంలో భక్తుల పూజలు



నవగ్రహ పూజ అనంతరం హారతి ఇస్తున్న అర్చకస్వామి

నల్లకుంట: శని అమావాస్యను పురస్కరించుకుని శనివారం న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఆలయ ప్రాంగణంలోని నవగ్రహ మందిరంలో అర్చక స్వామి సీతారామశర్మ మంత్రోచ్చరణల మధ్య శనీశ్వరుడికి తైలాభిషేకం చేశారు. అనంతరం అర్చనలు, హారతులు ఇచ్చారు. ప్రధాన ఆలయంలో సీతారామాంజనేయస్వామివారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

నేడు పంచాంగ శ్రవణం..

నేడు ఉగాది సందర్భంగా సాయంత్రం 6 గంటలకు పంచాంగ శ్రవణం ఉంటుందని ఆలయ కార్య నిర్వహణాధికారి జయంతి తెలిపారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, ఉగాది పచ్చడి వితరణ ఉంటుందన్నారు.

ఆర్యవైశ్య భవన్‌లో..

ముషీరాబాద్: ఉగాది పర్వదినం సందర్భంగా రాంనగర్ డివిజన్‌లోని పవిత్రనగర్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో పంచాంగ శ్రవణం ఉంటుందని సంఘం అధ్యక్షుడు సుధాకర్‌గుప్తా ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ పంచాంగ శ్రవణంలో రాంనగర్ ఆర్యవైశ్యులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

స్వయం శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి



మహిళలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: మహిళలు స్వయం శిక్షణా కోర్సులను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా రాణించాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. శనివారం డివిజన్‌లోని వీవీగిరినగర్ కమ్యూనిటీహాల్‌లో లయన్స్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. ఈ శిబిరంలో ఇటీవల ప్రవేశపెట్టిన బ్యుటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామన్నారు. పేద, మధ్యతరగతికి చెందిన మహిళలు ఉచిత శిక్షణను వినియోగించుకోవాలన్నారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, నేతలు సాయికుమార్, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మార్వో వీరబాయి తదితరులు

నల్లకుంట: పౌరహక్కులపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని, అంబర్‌పేట ఎమ్మార్వో వీరాబాయి అన్నారు. పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆధ్వర్యంలో శనివారం నల్లకుంట డివిజన్ పరిధిలోని నర్సింహ్మ బస్తీ కమ్యూనిటీహాల్‌లో బస్తీవాసులకు పౌరహక్కులపై అవగాహన కల్పించారు. ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించుకోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎమ్మార్వో సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అమృత, నల్లకుంట ఎస్సై వెంకట్రామ్ రెడ్డి, డిప్యూటీ ఎమ్మార్వో బలరాం, ప్రదీప్, ఆర్ఐ బిక్షపతి, పౌరసరఫరాల విభాగం(ఏఎస్‌వో) సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ సునీత, జీహెచ్ఎంసీ అధికారి ఐలయ్య, నర్సింహ బస్తీ అధ్యక్షుడు ఎం.భూపతినాథ్, బస్తీపెద్దలు మహేందర్, కె. లక్ష్మణ్ కుమార్, ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు చంద్రశేఖర్

అంబర్‌పేట: రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, ప్రేమేందర్‌రెడ్డిలు తెలిపారు. శనివారం అంబర్‌పేటలో బీజేపీ ఓబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో ఓబీసీ రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథిలుగా విచ్చేసి మాట్లాడుతూ తెలంగాణలో ప్రజలు బీజేపీ వైపు మొగ్గుచూపుతున్నారని, క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజ సమస్యలపై దృష్టి సారించాలన్నారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు ఈశ్వరప్ప, ఎన్.దివాకర్, శ్రీకాంత్, సంజయ్, మహేశ్, రమేష్ తదితరులు ఉన్నారు.

సీతారాముల శోభాయాత్రకు సహకరించాలి



అంబర్‌పేట: సీతారాముల శోభాయాత్రకు అనుమతితో పాటు అవసరమైన ఏర్పాట్లు చేయాలని శ్రీరామనవమి ఉత్సవ సమితి ప్రతినిధులు, బీజేపీ నేతలు ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామికి వినతిపత్రం అందజేశారు. శనివారం అంబర్‌పేట సీపీఎల్ రోడ్డులో ఉన్న డీసీపీ కార్యాలయంలో వచ్చే నెల 6న పెద్ద ఎత్తున శోభాయాత్రను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డీసీపీకి వివరించారు. అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ నుంచి ఛే నంబర్ ఛౌరస్తా మీదుగా తిలక్‌నగర్, బర్కత్‌పుర, కాచిగూడ మీదుగా రాంకోఠిలోని హనుమాన్ వ్యాయమశాల వరకు శోభాయాత్ర ఉంటుందన్నారు. వైభవంగా చేపట్టే ఈ యాత్రకు సహకరించాలని వారు డీసీపీని కోరారు. బీజేపీ నేతలు డాక్టర్ ఎన్.గౌతంరావు, కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్, అజయ్‌కుమార్, బుచ్చిరెడ్డి, చుక్క జగన్, ఎక్కాల కన్న తదితరులున్నారు.

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ !

వ్యాపారిపై కేసు నమోదు

కాచిగూడ: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఓ వ్యాపారిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నింబోలిఅడ్డ ఏకే భవన్ వద్ద నివాసం ఉంటున్న శ్రీనాథ్ రాటి (30) వ్యాపారం చేస్తుంటాడు. కాగా ఐపీఎల్ క్రికెట్‌మ్యాచ్ సందర్భంగా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడి ఇంటిపై దాడిచేసి సెల్‌ఫోన్ తనిఖీ చేయగా.. విషయం వెలుగులోకి వచ్చింది. రూ.1,0,1,000తో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక





ముషీరాబాద్: ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. శనివారం సాయంత్రం భోలక్‌పూర్ డివిజన్ బడీ మసీదులో ముత్తవల్లి నజీర్ అలీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఇరువర్గాల ప్రజలు గంగా జమున తైజీబ్ వలే కలిసిమెలిసి ఉంటారన్నారు. వై.శ్రీనివాస్‌రావు, మహ్మద్ అలీ, ఎండీ మోహన్, జబ్బార్, ప్రవీణ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

గుల్షన్‌నగర్ మసీదులో..

గుల్షన్‌నగర్ మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ఇఫ్తార్‌ను ప్రారంభించారు. భోలక్‌పూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జఫీర్ ఉద్దీన్, నాయకులు ఖదీర్, సురేష్‌కుమార్ తదితరులున్నారు.

గాంధీనగర్ సబర్మతీనగర్‌లో..

చిక్కడపల్లి: పండుగలు మతసామరస్యానికి ప్రతీకలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. శనివారం రాత్రి గాంధీనగర్ డివిజన్‌లోని సబర్మతీనగర్‌లో సుభాని మసీద్ కమిటీ సభ్యులు నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. రంజాన్ పండుగను పవిత్రంగా నిర్వహించుకునే ఈ పండుగను ఐక్యతకు చిహ్నాలని పేర్కొన్నారు. మసీద్ ఇమామ్ మహమ్మద్ మహబూబ్, బీజేపీ మైనార్టీ నాయకులు మహమూద్, రహమత్ అలీ, యసీన్, ఎండీ నవాబ్ కార్పొరేటర్, బీజేపీ నాయకులను శాలువాలతో సన్మానించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌ముదిరాజ్, సీనియర్ నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఉమేష్, ఆనంద్‌రావు, కుమార్, ధన్‌రాజ్, యాదగిరి, ప్రశాంత్, డేవిడ్‌లు పాల్గొన్నారు.

అందాల పోటీలను అడ్డుకుంటాం

'మిస్ వరల్డ్'అందాల పోటీల వ్యతిరేక వేదిక



సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో నిర్వహించతలపెట్టిన అందాల పోటీల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మహిళలను గౌరవించకుండా పోటీలను నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన 'మిస్ వరల్డ్'అందాల పోటీల వ్యతిరేక వేదిక సదస్సులో పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, రచయిత్రి జూపక సుభద్ర మాట్లాడారు. ప్రపంచ సుందరి పోటీలను మే నెలలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. అందాల పోటీలు అంటే మహిళల శరీరాలను అవమానించడమే తప్ప మరోటి కాదని అభిప్రాయపడ్డారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని అందాల పోటీల మీద ఖర్చు చేసే బదులు ప్రజలకు విద్య, వైద్య సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు ఝాన్సీ, ఐద్వా అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఆశాలత, వివిధ సంఘాల నాయకులు స్వరూప, వరలక్ష్మి, ప్రదీప్, కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడం సామూహిక బాధ్యత

ముషీరాబాద్: పేదల ఆకలి తీర్చే అన్నదాన కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సామూహిక బాధ్యతతో నిర్వహించాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకులు శ్రీధర్‌చారి అన్నారు. శనివారం ముషీరాబాద్ గౌరీశంకర ఆలయం వద్ద అమావాస్య సందర్భంగా శ్రీధర్‌చారి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి అమావాస్య రోజున దాదాపు 300 మందికి అన్నసమారాధన చేస్తామని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు పెద్దలు పేదలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ముషీరాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామకృష్ణముదిరాజ్, లింగంగుప్తా, జీఎస్.చారి, బీఆర్ఎస్ నాయకులు ఎయిర్‌టెల్ రాజు, వివేక్, బల్లా ప్రశాంత్, కిరణ్ తదితరులున్నారు.

అన్నప్రసాద వితరణ

నల్లకుంట: అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్నదానం కోటి గోవుల దాన ఫలితంతో సమానమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. పాల్గుణమాసం శని అమావాస్య సందర్భంగా వాకర్స్ క్లబ్ నల్లకుంట ఆధ్వర్యంలో శనివారం వీఎస్టీ రోడ్డులోని కట్ట మైసమ్మ ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేపట్టారు. దీనికి హాజరైన ఎమ్మెల్యే కాలేరు పేదలు, అన్నార్థులకు అన్నం వడ్డించి మాట్లాడారు. అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని చెప్పారు. ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేసే స్తోమత లేకపోయినా అన్నం పెట్టే ఇంటినైనా చూపించాలన్నారు. ఎవరికైనా ఎలాంటి లోటు లేకుండా అన్నం దొరకడం కాశీ అన్నపూర్ణ అమ్మవారి అనుగ్రహం ఉంటేనే ఆ భాగ్యం లభిస్తుందని చెప్పారు. వాకర్స్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ జిల్లా 301 డిస్ట్రిక్ క్యాబినెట్ సెక్రటరీ శైలజ, మాతా వాకర్స్ క్లబ్ తక్షణ పూర్వ అధ్యక్షుడు మురళీధరుడు, అధ్యక్షుడు బొమ్మిడి శ్రవణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు నీల శ్రీధర్, కోశాధికారి గాజర్ల నగధర్, సలహాదారుడు కేశవ్ రావు దేశ్‌పాండే, మీడియా ఇన్‌చార్జ్ జీవన ఆదిత్య, ప్రతినిధులు చంద్రమౌళీగుప్తా, ఎస్.హరినాథ్‌రెడ్డి, భూదాన్ వేదిర సాగర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సీహెచ్. మురళీకృష్ణ, లక్ష్మణ్, రామరాజు, బాలాజీ ఠాగూర్, దశరథ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



శివాలయం చౌరస్తా వద్ద శ్రీధర్‌చారి



అన్నప్రసాద వితరణలో ఎమ్మెల్యే కాలేరు